


# సాయి సూర్య
తెలుగు దిన పత్రిక
www.saisuryaa.com T/TG/2024/1225/9690/1229








ప్రచురణ: హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 36 ఎడిటర్ : పాలగోని రాజేష్ సోమవారం28 ఏప్రిల్ -2025 పేజీలు : 8 వెల : 4-00




## రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ

# నెంబర్ వన్ విలన్:

**-రజతోత్సవ సభ వేదిక నుంచి కేసీఆర్ ప్రసంగం**

- -పహల్గామ్ దాడిలో మృతులకు నివాళి
- -పదేళ్ల పాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేశాం: కేసీఆర్
- -చంద్రబాబు తెలంగాణ పదమే ఉపయోగించకూడదన్నారు: కేసీఆర్
- -నకిలీ గాంధీలంటూ ఘాటు విమర్శలు
- - మళ్లీ రాష్ట్రంలో 2014కి ముందు పరిస్థితులు
- -హెచ్‌సీయూ యూనివర్శిటీ భూములు అమ్ముతారా?
- -ఆపరేషన్ కగార్ ఆపేయాలి: కేసీఆర్-పోలీసులకు కేసీఆర్ వార్నింగ్

**అవే పంచులు, అదే ఘాటుతనం, అదే మాటల మంత్రం ఏ మాత్రం తగ్గని పోరాట పటిమ, పడి లేచిన తెలంగాణ ఉద్యమాన్ని ఎలా పరుగులు పెట్టించారో..అలాగే బీఆర్ఎస్‌కు కొత్త జోష్ అందించారు. ఒకే ఒక్క సభతో అన్నిటికి సమాధానం చెప్పారు. ఇన్నాళ్లు సైలెంట్ గా ఉన్నాడు, ఇక రాడు అనుకున్నారేమో...కానీ ఒక్కసారి వచ్చారంటే ఎలా ఉంటుందో చూపించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగం మరోసారి యావత్ తెలుగు రాష్ట్రాలను టీవీలకు అతుక్కుపోయేలా చేసింది.**

హన్మకొండ-సాయి సూర్య:
హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి రజతోత్సవ సభ వేదిక నుంచి బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ ప్రస్తానం నుంచి నేటి వరకు సాగిన ప్రయాణాన్ని మరోసారి ప్రజల ముందు ఉంటారు. అందరికీ తెలిసిందే ఐనా...తమ ప్రయాణం ఎలా సాగిందో చెప్పి శ్రేణుల్లో భావోద్వేగాలను రేపారు. మరొక్కసారి జై తెలంగాణ, జై కేసీఆర్ అని భావోద్వేగంతో నినదించేలా చేశారు. అంతేకాదు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచిని, తీసుకున్న నిర్ణయాలను ప్రజల ముందు ఉంటారు. ఇక రాష్ట్రంలో అధికార పార్టీ పాలనను ఎండగట్టారు. ఒక్కో అంశం ప్రస్తావిస్తూ అధికార పార్టీ నేతలను కడిగిపారేశారు మధ్యమధ్యలో శ్రేణులు సీఎం...సీఎం అంటూ గోల చేస్తే...తనదైన స్టయిల్‌లో వారించారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మరోమారు విమర్శల దాడి ఎక్కుపెట్టారు. అంతేకాదు...పెహల్గామ్ ఉగ్రదాడిలో మృతులకు నివాళి అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

2



## బీఆర్ఎస్ పార్టీకి హరీశ్ రావు

# దూరం అవుతున్నారా?

- పార్టీ పండుగలో హరీశ్ రావు ఫోటో ఏమైంది?
- పత్రికలు, బ్యానర్లు, పోస్టర్లలో కనిపించని హరీశ్ రావు ఫోటో
- సభలోనూ దూరంగా కూర్చుకున్న హరీశ్ రావు
- హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీలో ఒకప్పుడు నెంబర్ -2. మరి ఇప్పుడు...? పెద్ద క్వశ్చన్ మార్క్. బీఆర్ఎస్ పార్టీలో ఆయన స్థానం ఏంటి? పార్టీకి దూరంగా ఉంటున్నారా? దూరం పెడుతున్నారా? బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఎందుకా..దూరం.? పార్టీ ఎందుకు దూరం పెట్టింది. ?

సాయి సూర్య-తెలంగాణ డెస్క్:
బీఆర్ఎస్ రజతోత్సవ సభ 25ఏళ్ల పండుగ అంగరంగ వైభవంగా సాగింది. ఎల్కతుర్తి సభ మొత్తం గులాబీమయం అయ్యింది. అయితే సభ ఏర్పాట్ల దగ్గరి నుంచి స్టేజీ మీదకు కూర్చోవడం వరకు హరీశ్ రావు...అంతంత మాత్రంగానే వ్యవహరించారని అంటున్నారు. టీఆర్ఎస్ అంటే...కేసీఆర్. ఆ పార్టీలో ఉద్యమకాలంలో వెంట ఉంది హరీశ్ రావు. కానీ ఆ హరీశ్ రావు కొన్ని రోజులుగా అంటిముట్టనట్టుగా ఉంటున్నారు. ఆయన అలా ఉండటానికి కారణాలేంటి.? కావాలనే పక్కకు పెట్టారా అనే అనుమానాలు కలుగుతున్నాయి.

## ఉగ్రదాడి దోషులను

# వదిలిపెట్టం

- -పహల్గామ్ ఉగ్రదాడిపై ప్రధాని మోదీ తీవ్ర స్పందన
- -దాడికి పాల్పడిన వారికి, కుట్రదారులకు కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక
- -బాధితుల కుటుంబాలకు తప్పక న్యాయం చేస్తామని హామీ
- -కశ్మీర్‌లో శాంతి, అభివృద్ధిని చూసి శత్రువులు కుట్ర పన్నారు
- -ఉగ్రవాదంపై పోరులో దేశ ఐక్యతే కీలకమని మోదీ ఉద్ఘాటన



జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ అమానవీయ చర్యకు పాల్పడిన ఉగ్రవాదులకు, దీని వెనుకున్న కుట్రదారులకు అత్యంత కఠినమైన శిక్ష తప్పదని ఆయన గట్టిగా హెచ్చరించారు. బాధితుల కుటుంబాలకు తప్పకుండా న్యాయం జరుగుతుందని ప్రధాని భరోసా ఇచ్చారు. ఆదివారం తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో జాతినుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ప్రతి భారతీయుడినీ కలచివేసిందని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. "ఈరోజు మీతో నా మనసులోని మాట పంచుకుంటున్న వేళ, నా హృదయం తీవ్ర వేదనతో నిండి ఉంది. పహల్గామ్ ఉగ్రదాడి ప్రతి పౌరుడి హృదయాన్ని గాయపరిచింది. బాధితుల కుటుంబాల పట్ల ప్రతి భారతీయుడూ తీవ్ర సానుభూతి వ్యక్తం చేస్తున్నాడు. ఏ రాష్ట్రానికి చెందిన వారైనా, ఏ భాష మాట్లాడే వారైనా, ఈ దాడిలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారి బాధను అనుభవిస్తున్నారు" అని మోదీ తెలిపారు.

## చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది: షర్మిల

3



రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలకు ఇది నిదర్శనమని వ్యాఖ్యఘటనపై అత్యున్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్‌కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకు గురికావడం పట్ల ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనపై ఆమె తీవ్రంగా స్పందిస్తూ, రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వెలిబుచ్చారు.

# మే 2న అమరావతికి ప్రధాని మోదీ...

**-మంత్రులు, అధికారులతో చంద్రబాబు సమీక్ష**

మే 2వ తేదీన అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో... ఏపీ సీఎం చంద్రబాబు ఈ సాయంత్రం మంత్రులు, ఉన్నతాధికారులతో ఉండవల్లిలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధాని పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు.అమరావతి అందరి రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంలో అన్ని ప్రాంతాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరి రాజధానిగా అమరావతి నిర్మాణం సాగుతుందని అన్నారు. అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధితో ముందుకెళుతున్నామని చంద్రబాబు వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా, అమరావతిలో పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు.ప్రధాని పర్యటన ఏర్పాట్లను కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. మోదీ మే 2న మధ్యాహ్నం గన్నవరం విమానాశ్రయం చేరుకుని, హెలికాప్టర్‌లో అమరావతికి బయలుదేరతారు. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే సభలో పాల్గొంటారు. ఇందుకోసం వెలగపూడి సచివాలయం వెనుక 250 ఎకరాల్లో సభాస్థలి, హెలిప్యాడ్‌లు, పార్కింగ్ సహా భారీ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్ 28 నాటికి పనులు పూర్తిచేయాలని



లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు నియమించారు. మోదీ పర్యటనలో దాదాపు లక్ష కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అమరావతి పునఃప్రారంభానికి ఇది కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

# తెలంగాణ నూతన సీఎస్ గా కె.రామకృష్ణారావు



- -ప్రస్తుత సీఎస్ శాంతికుమారి పదవీకాలం ఏప్రిల్ 30తో ముగింపు
- -ముందుగానే నూతన సీఎస్ నియామక ప్రక్రియ పూర్తి చేసిన తెలంగాణ సర్కారు
- -కె.రామకృష్ణారావు 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి కె.రామకృష్ణారావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైన సీఎస్ పదవికి రామకృష్ణారావును ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈ నెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్నారు. ఆమె పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో, తెలంగాణ ప్రభుత్వం ముందుగానే కొత్త సీఎస్ నియామక ప్రక్రియను పూర్తి చేసింది. శాంతి కుమారి స్థానంలో కె.రామకృష్ణారావు బాధ్యతలు చేపట్టనున్నారు.1991 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన రామకృష్ణారావు, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సుదీర్ఘ పాలనా అనుభవం కలిగిన ఆయన, గతంలో పలు ముఖ్యమైన శాఖల్లో పనిచేశారు. ఆర్థిక శాఖలో ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం, ఇప్పుడు అత్యున్నత పరిపాలనా పదవి అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించింది. త్వరలోనే ఆయన నూతన పదవిలో బాధ్యతలు స్వీకరించనున్నారు.

# రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ నెంబర్ వన్ విలన్: కేసీఆర్



దేశ్ కీ నేత అంటే ఎలా ఉండాలో...చెప్పకనే చెప్పారు. అలాగే ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా నిరసన గళం వినిపించారు. కేంద్ర ప్రభుత్వం కగార్ పేరుతో మావోయిస్టులను అక్రమంగా కాల్చివేయడంపై ప్రశ్నలు సంధించారు. శాంతితోనే సమాజం ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో పోలీసుల తీరుపై విమర్శలు గుప్పించారు. అన్ని పార్టీల నేతలలాగే...ఖబర్దార్ అంటూ పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. ఇలా సాగిన కేసీఆర్ మాటల దాడి... మరోసారి తెలంగాణ ప్రజల చెవుల్లో మారుమ్రోగుతున్నాయి. ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నా వారికి ఫుల్ మీల్స్ గా అనిపించింది.మొదట పహల్గామ్ దాడిలో మృతులకు నివాళి అర్పించి...ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్...కాంగ్రెస్ పాలనను తూర్పురబట్టారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ నెంబర్ వన్ విలన్ అని కేసీఆర్ విమర్శించారు. 1956, 1969 తెలంగాణను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ మొదటి విలన్ అన్నారు.

**తెలంగాణ రాష్ట్ర సమితి చరిత్ర**

వలసవాదుల విషకౌగిలిలో చిక్కుకున్న తెలంగాణకు విముక్తిని కల్పించాలనే లక్ష్యంతో ఒక్కడినే బయలుదేరానన్నారు. పిడికిలి మందితో ప్రయాణం ప్రారంభించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్ల పాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేశానన్నారు కేసీఆర్.

**చంద్రబాబుపై మరోసారి విమర్శలు**

సమైక్య పాలకుడిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డు తగిలిన టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ద్రోహాలు, దుష్ట చర్యలను ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ మర్చిపోలేదు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఏపీ శాసన సభలో తెలంగాణ పదమే ఉపయోగించకూడదని రూలింగ్ ఇచ్చారని గుర్తు చేసి విమర్శించారు.

**రాష్ట్రాన్ని అభివృద్ధిని చేశాం: కేసీఆర్**

పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు కేసీఆర్. ప్రాజెక్టు నిర్మించి సాగుభూమిని పెంచామని చెప్పారు. మూడేళ్లలోనే కాళేశ్వరం నిర్మించామని చెప్పారు. రైతులకు ఆర్థిక సాయం కొరకు రైతుబంధు, రైతు బీమా అమలు చేశామన్నారు. మిషన్ భగీరథ వంటివి తమ హయాంలో చేపట్టిన అనేక కార్యక్రమాలు అభివృద్ధి చర్యలను చెప్పారు.

**కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు**

బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిలో దేశంలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న తెలంగాణకు నేడు ఏం బీమారి వచ్చిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల పాలనతో నేడు రాష్ట్ర పరిస్థితి దిగజారిందని చెప్పారు. ఢిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలంటూ ఘాటు విమర్శలు చేశారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారని అన్నారు. తన కళ్ల ముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దు:ఖం వస్తోందన్నారు. మళ్లీ కరెంటు కోతలు, మోటార్లు కాలిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. 2014కి ముందు పరిస్థితులు మళ్లీ రాష్ట్రంలో వచ్చాయన్నారు.

**ఇప్పటి నుంచి బయటికి వస్తా: కేసీఆర్**

ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీకి సమయం ఇవ్వాలని బయటికి రాలేదన్నారు ఇప్పటి నుంచి బయటికి వస్తా అన్నారు కేసీఆర్. అందరి తరపున పోరాడతానని ..ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలన్నారు.

**యూనివర్సిటీ భూములు అమ్ముతారా?**

భూములు అమ్మొచ్చు అభివృద్ధి చేయొచ్చు కానీ ఏది అమ్మాలో విచక్షణ ఉండాలన్నారు కేసీఆర్. ఎక్కడైనా యూనవర్శిటీ భూములు అమ్ముతారా అని ప్రశ్నించారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి: కేసీఆర్**

బీజేపీ పదకొండేళ్ల కాలంలో తెలంగాణకు 11 రూపాయలు ఇవ్వలేదని విమర్శించారు. అలాగే బీజేపీ వైఖరి అంతా భభ్రమానం, భజగోవిందం శుష్క ప్రియాలు, శూన్య హస్తాలు అని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులు, యువతను బలగాలు ఊచకోతను కోస్తున్నారని...చర్చలకు పిలవాలని మావోయిస్టులు కోరతున్నారన్నారు. వారి వినతి మేరకు చర్చలు చేపట్టాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని...కోరారు.

**పోలీసులకు వార్నింగ్**

తెలంగాణ పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు కేసీఆర్. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల చర్యలను విమర్శించారు. పోలీసుల పేర్లను డైరీలో రాసుకుంటామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడ వద్దన్నారు. వారికి అండగా ఉంటామన్నారు.

# బీఆర్ఎస్ పార్టీకి హరీశ్ రావు దూరం అవుతున్నారా?

బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం ఆ పార్టీ పత్రిక ప్రకటనలు, బ్యానర్లు, వీడియోలు, పోస్టర్లు రూపొందించింది. సాధారణంగా ప్రతి సారి కేసీఆర్ ఫోటోతో పాటు, కేటీఆర్, హరీశ్ రావు, కవిత ఫోటోలు ఉంటాయి. కానీ ఈ సారి హరీశ్ రావు ఫోటోలు మిస్ అయ్యాయి. ఒక్క చోట కాదు మొత్తం ఈవెంట్లో హరీశ్ రావు ఫోటో కనిపించలేదు. కొన్ని పత్రికల్లో ఆయన ఫోటో కనిపించలేదు. కేసీఆర్, కేటీఆర్ ఫోటోతో మాత్రమే పత్రికల్లో ఫ్రంట్ పేజ్ యాడ్ ఇచ్చారు. ఇక కొంత మంది బీఆర్ఎస్ పార్టీ నేతలు ఇచ్చిన ఫ్రంట్ పేజ్ ఇచ్చిన యాడ్ లోనూ హరీశ్ రావు ఫోటో మిస్ చేశారు. ఇక బీఆర్ఎస్ సభ కోసం కట్టిన బ్యానర్లు, పోస్టర్లలోనూ హరీశ్ రావు ఫోటోలు కనిపించలేదు. వేదికపై వెనుక ప్లే చేసే వీడియోలోనూ కేసీఆర్, కేటీఆర్ మాత్రమే కనిపించారు. ఇక హరీశ్ రావు సభలో కూడా దూరందూరంగానే ఉన్నారు. సాధారణంగా సభలు జరిగితే...పార్టీలో సీనియర్లు, కీలక నేతలను వరుస క్రమంలో కూర్చోబెడతారు. అధినేతకు ఇరు పక్కల కూర్చుంటారు. కానీ హరీశ్ రావు సాధారణ నేతల దూరంగా ఉన్నారు. కేటీఆర్ మాత్రం కేసీఆర్‌కు దగ్గరలోనే ఉన్నారు. హరీశ్ రావు..మాజీ మంత్రులు, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డితో కలిసి కూర్చుకున్నారు. సభలో హరీశ్ రావు ప్రసంగం కూడా చేయలేదు. కొందరు నేతలు మాత్రమే ప్రసంగించినప్పటికీ ఆయన అంటిముట్టనట్టుగానే వ్యవహరించారట. గతంలో హరీశ్ రావు పార్టీ ప్రతికార్యక్రమాన్ని దగ్గరుండి చూసుకునే వారు. కానీ ఈసారి అవేమీ పట్టించుకోలేదు. హరీశ్ రావును దూరం పెట్టడానికి కారణం కేటీఆర్ తో విభేదాలే అంటున్నారు. గతంలో కేటీఆర్ తో విభేధాలు ఉన్నాయని మీడియా కోడే కూసింది. ఇప్పుడు హరీశ్ రావుతో ఇవే కారణం అంటున్నారు. మొత్తంగా హరీశ్ రావు ఫోటోలు, ఆయన సభలో వ్యవహరించిన దూరం అనేక చర్చలకు కారణం అయ్యాయి.



## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన మండల పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు,

ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 27

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలలో భాగంగా జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన మండల పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు, ఎంపీపీ కృపేష్ , ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి , మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏనుగు బుచ్చి రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఏనుగు భరత్ రెడ్డి, నాయకులు ఆకుల సురేష్ , సుల్తాన్ , కత్తుల కుమార్, నరేందర్ రెడ్డి , మల్లేష్ , రాజేందర్ రెడ్డి , సురేష్ తదితరులు పాల్గొన్నారు

# వరంగల్ రజతోత్సవ సభకు చింతపల్లి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు

చింతపల్లి, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 27 వరంగల్ రజతోత్సవ బహిరంగ సభకు చింతపల్లి మండల కేంద్రం నుండి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆదివారం ఉదయం బయలుదేరారు. ముందుగా చింతపల్లి మండల కేంద్రం లోని ప్రధాన కూడలి ఇన్స్పెక్షన్ బంగ్లా వద్ద బీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం కేసీఆర్ నేతృత్వంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎల్లంకి చంద్రశేఖర్, ఎల్లంకి అశోక్ వందనపు ఆంజనేయులు, ఉప్పల యాదయ్య, ఆదిత్యుని భాస్కర్ శర్మ, నల్ల శంకర్, కాలేద్, సమద్, అన్వర్, ధనరాజ్, ఎర్ర వెంకటయ్య, హజార్, ఎండి రషీద్, నాగటి వెంకటేష్, నేతాళ్ళ సైదులు, గునుకుల పుల్లయ్య, చెన మోని



ఎల్లేష్, చెనమోని వెంకటేష్, చెనమోని అంజయ్య, కొప్పుల వెంకటయ్య, తాళ్ల సైదులు, నాగటి బజారు, గునుకుల రాములు, తాళ్ల మహేష్ చింతపల్లి మండల నాయకుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వరంగల్‌కు తరలి వెళ్లారు

# పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఇబ్రహీంపట్నంలో కొవ్వొత్తులతో ర్యాలీ




ఇబ్రహీంపట్నం, సూర్య టుడే న్యూస్ ప్రతినిధి ఏప్రిల్ 27

వేసవిలో కాశ్మీరీ అందాలను ఆస్వాదించేందుకు వెళ్లిన 26 మంది పర్యాటకులను ఘోరాతి ఘోరంగా కాల్చి చంపి రక్తపాతం సృష్టించిన ఉగ్రదాడి ఘటన ఇంకా దేశ ప్రజల గుండెల్లో మంటలు రేపుతూనే ఉంది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రధాన రహదారి నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులతోపాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

**లేమామిడి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్**

షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 27) : గ్రామీణ స్థాయిలో యువకులు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చాలని క్రీడలు మానసిక శరీరక ఉల్లాసాన్ని ఇస్తాయని లే మామిడి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్ అన్నారు.ఆదివారం కేశంపేట్ మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గ్రామస్థాయి క్రికెట్ పోటీలు గత 12 రోజులుగా నిర్వహించారు. ఈ టోర్నమెంటులో 50 జట్లు పాల్గొనగా ఫైనల్ లో లేమామిడి జట్టు విజయం సాధించింది.గెలుపొందిన వారికి మొదటి బహుమతి శతాబ్ది టౌన్ షిప్ కాసు శ్రీనివాస్ రెడ్డి. 30 వేలు, రెండవ బహుమతి లేమామిడి ఫ్రెండ్స్ యూత్ అందించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ మాట్లాడుతూ... క్రీడల్లో ప్రతి ఒక్కరు రాణించాలని,



క్రీడలు రేపటి తరానికి ఎంతో దోహద పడతాయని ఆయన అన్నారు. క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చాలని అన్నారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని ఆయన గర్వంగా తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు లే మామిడి గ్రామంలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శతాబ్ది టౌన్ షిప్ కాసు శ్రీనివాస్ రెడ్డి, జగత్ రెడ్డి, శేఖర్ రెడ్డి, డీలర్ శంకరయ్య ,ప్రకాష్ గౌడ్, కుమార్ గౌడ్, అల్లాజి, చాకలి రవి, శ్రీకాంత్ రెడ్డి, దిద్దెల యాదయ్య, రమేష్, క్రీడాకారులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ

**-: షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



షాద్ నగర్ సూర్య టుడే ప్రతినిధి (ఏప్రిల్ 27):

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన షాద్ నగర్ నియోజకవర్గం పరిధిలోని చౌదరిగూడ,కొందుర్గ్,ఫరూఖ్ నగర్,కొత్తూర్,నందిగామ, కేశంపేట్, మండలం మరియు షాద్ నగర్ పట్టణానికి చెందిన 30 మంది లబ్ధిదారులకు (రూ. 13.37,500/-) సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులతో పలు గ్రామాల ముఖ్యనాయకులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సాయిసూర్య చెప్పిందే నిజమైంది..

# నూతన సీఎస్‌గా కె. రామకృష్ణారావు



సాయిసూర్య-తెలంగాణ డెస్క్:

సాయిసూర్య చెప్పిందే నిజమైంది. కొత్త సీఎస్‌ను ప్రభుత్వం ప్రకటించింది. అందులోనూ సాయి సూర్య అంచనా వేసిన అధికారిని నియమించింది రాష్ట్ర ప్రభుత్వం. తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది. సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థికశాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రామకృష్ణారావు పదవీకాలం ఈ ఏడాది ఆగస్టులో రిటైర్డ్ అవ్వనున్నారు. ఐతే తర్వాత కూడా కొనసాగిస్తారా? లేక కొత్తవారిని తిరిగి ఎంపిక చేస్తుందా? అని ఆసక్తిగా మారింది

# ప్రపంచ పశు వైద్య దినోత్సవం

## -వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిపించండి

## -నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్అభ్యర్థన










డోన్
శనివారం రోజు ఒక ప్రకటన ద్వారా నంద్యాల జిల్లా ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ పశు వైద్య దినోత్సవ సందర్భంగా వీధి కుక్కల వలన ప్రజలకు కుక్క కాటుకు గురై దేశంలో లక్షలాదిమంది చనిపోవడం జరుగుతుందని కుక్కల ఉత్పత్తిని నిరోధించడానికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లు పశువర్ధక శాఖ మున్సిపల్ సిబ్బంది చేయించాలని అలా చేయించడం వలన కుక్కతన పిల్లలకు పాలు ఇవ్వలేక చనిపోతున్నాయని కుక్క పిల్లలు కూడా చనిపోతున్నాయని అదేవిధంగా ఆహారం లేక తిక్క పట్టి మనసులను కొరుకుతూ మనసులో ప్రాణాలను హరిస్తున్నాయని కావున వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీధి కుక్కలకు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లను చేయించి ప్రజలకు కుక్కల నుండి రక్షణ కల్పించాలని అదేవిధంగా ఆవులకు బర్రెలకు ఇంజక్షన్స్ ద్వారా పాలు పిండి ప్రజలకు అమ్ముతున్నారని అలా ఇంజెక్షన్ చేయడం వలన పశువు కొద్ది రోజులకు అనారోగ్యానికి గురై మరణిస్తున్నాయని అదేవిధంగా ఇంజక్షన్ ద్వారా వేసి పాలు పిండి ప్రజలకు ఇవ్వడం వలన వాటిని తాగి చిన్న పిల్లలు ప్రజలు మరణిస్తున్నారని ఇంజక్షన్లు వేసే సాంస్కృతిని పాడి పశువుల రైతులకు పశువర్ధక శాఖ వారు అవగాహన కల్పించాలని ఆవులను పట్టణ వీధులలో విడవకుండా ఆవుల యజమానులకు జాగ్రత్తలు చేసి ఆవులను వదలకుండా ఇంటి దగ్గరనే వాటిని కట్టివేయాలని వీధులలో ఆవులను విడచడం వలన అవి వ్యర్థ పదార్థాలు ప్లాస్టిక్ కాగితాలు తిని చనిపోయే పరిస్థితి వస్తుందని కనుక వెంటనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మేము కోరిన విషయాలపై వెంటనే స్పందించి ప్రజలను కాపాడాలని మరియు పశువులను కాపాడాలని వీధి కుక్కలను కాపాడాలని కోరుతున్నాము ఉత్తమ సేవలు అందించిన పశు వైద్యాధికారులు సిబ్బందికి ఆగస్టు 15 జనవరి 26వ తేదీ ఉత్తమ ప్రశంసా పత్రాలు అందించి వారిని ప్రోత్సహించాలని నంద్యాల జిల్లా కలెక్టర్ గారిని ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ మెంబర్ ఏఈ నాగరాజు గౌడ్ అభ్యర్థిస్తున్నారు ఈ కార్యక్రమంలో డోన్ తాలూకా వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ మనోజ్ కుమార్ వెల్దుర్తి మండల వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ కాల్వ ఓం నారాయణ బేతంచర్ల మండల వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ గుంటుపల్లి రవికుమార్ ప్యాపిలి మండలం వినియోగదారుల రక్షణ సంఘం కన్వీనర్ ఊటకొండ చిన్న మద్దయ్య గారు డోన్ మండల వినియోగదారులమహిళా రక్షణ సంఘం కన్వీనర్ వనం లక్ష్మీదేవి ప్యాపిలి మండలం వినియోగదారుల రక్షణ సంఘం మహిళా కన్వీనర్ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు

# చెంచులకు తేనె తీగలపెంపకం పై శిక్షణ కార్యక్రమము

నంద్యాల
నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో చెంచు కుటుంబాలకు తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకట శివప్రసాద్ సహా పరిశోధన సంచాలకులు ఏడిఆర్ డాక్టర్ జాన్సన్ జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ శివప్రసాద్ మాట్లాడుతూ చెంచుల జీవనోపాధిని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు అందులో భాగంగా తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తేనెటీగలకు అవసరమైన బాక్సులను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు ఈ సందర్భంగా డాక్టర్ ఎం జాన్సన్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ వ్యవసాయ పరిశోధనా స్థానము నంద్యాల వారు మాట్లాడుతూ ఈ ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం తేనెటీగల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులు నవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుటకు దోహదపడుతుంది అని పేర్కొన్నారు అదేవిధంగా తేనెటీగల పెంపకం చేపట్టినట్లయితే తేనెటీగల వలన పంట సాగులో పుష్పాలన్ని కూడా బాగా ఫలదీకరణం చెంది అధిక దిగుబడి పొందటానికి తేనెటీగల పెంపకం దోహ దపడటంతో పాటు గా వీటి పెంపకం వలన అదనపు ఆదాయం కూడా పొందవచ్చని రైతులను ఉద్దేశించి సూచించారు ఈ కార్యక్రమంలో మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి జిల్లా వ్యవసాయ అధికారి వై మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ తేనెటీగల పెంపకాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టి తేనెటీగలకు ఏమాత్రం హాని కలగకుండా తేనె తీయడం వలన తేనెటీగల పరిరక్షిస్తూ వాతావరణాన్ని కూడా పరిరక్షించినట్లు అవుతుందని తెలియచెప్పారు ఈ కార్యక్రమంలో




ఐటిడిఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీ ఏజీ నాయక్ గారు వ్యవసాయ శాస్త్రవేత్తలు వారి సిబ్బంది వెలుగు సిసి వీరన్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు ఈ సందర్భంగా శిక్షణ పొందినటువంటి వారికి తేనెటీగల పెంపకానికి తేనెటీగల పెట్టెలు శిక్షణ పొందిన వారికి ఇవ్వడం జరిగింది. ఏడు రోజుల శిక్షణ కార్యక్రమానికి పూర్తి చేసుకున్నటువంటి వారికి సర్టిఫికెట్లు కూడా ప్రధానం చేయడం జరిగింది.

# గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పకడ్బందీగా అమలు చేయండి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**



నంద్యాల
గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంలో నిర్దేశించిన అంశాలను పకడ్బందీగా అమలు చేస్తూ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, ఎన్టీఆర్ వైద్య సేవ కార్యక్రమాల అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ వెల్లడి నిషేధంపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. నిషేదిత చట్టంలోని నిబంధనల మేరకు స్కాన్ సెంటర్లు లేదా డయాగ్నస్టిక్ సెంటర్లు లింగ నిర్ధారణ చేసినట్లయితే కఠిన చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ కోసం ప్రయత్నించినా లేదా ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు ఆసుపత్రులలో ఈ చట్టంపై అవగాహన కోసం ఫ్లెక్సీల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కొత్త స్కాన్ సెంటర్స్ తప్పనిసరిగా జిల్లా కమిటీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రతి 5 సంవత్సరాలకు రెన్యూవల్ నిమిత్తం నెల రోజుల ముందే అప్లై చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రెన్యువల్ కు వచ్చే స్కానింగ్ కేంద్రాలు హైపవర్ మిషన్ వాడాలని లేనిపక్షంలో రెన్యువల్ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై స్త్రీ శిశు సంక్షేమం, మహిళా సంఘాలు, పోలీస్ వారి సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో లింగానిర్ధారణ పరీక్షలు జరగకుండా పోలీసు అధికారులతో వైద్యులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ క్రింద ప్రజలకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించకుండా నగదు వసూలు చేసినట్లు 8 ఆసుపత్రుల్లో 33 ఫిర్యాదులు నమోదు అయ్యాయని వారికి నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల భర్తీ కోసం డిఓ లేఖను సిద్ధం చేయాలని కలెక్టర్ డిఎంహెచ్ఓను ఆదేశించారు. చట్ట వ్యతిరేకంగా పరీక్షలు చేసిన వైద్యులుకు మొదటి సారి తప్పుకు 10 వేలు జరిమానా, 3 సంవత్సరాల జైలు శిక్ష, రెండవ సారి తప్పు చేస్తే 50వేలు, 5 సంవత్సరాల జైలు శిక్ష ఉంటుందన్నారు. మూడవ సారి అదే తప్పు చేస్తే వైద్యుల పేర్లు కౌన్సిల్ నుండి పేరు తొలగించడం జరుగుతుందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలకు ప్రోత్సహించే వారికీ 3 సంవత్సరాల జైలు మరియు 50 వేలు జరిమానా, రెండవ ధపాకు 5 సంవత్సరాలు జైలు మరియు లక్ష రూపాయలు జరిమానా విధించబడుననే అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ స్కానింగ్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ వెంకటరమణ, సిఐ సూర్య మౌళి, మదర్ సొసైటీ %చీ+గా% రామారావు, ఇంచార్జ్ %ణజనూ% డా. ఓ. లలిత, ఎన్టీఆర్ వేద సేవ కోఆర్డినేటర్ డా. రూపేంద్ర నాథ్ రెడ్డి, ఇంచార్జ్ డెమో కె రవీంద్ర నాయక్, జిల్లా మానిటరింగ్ అధికారి సుమలత, వంశీ పాల్గొన్నారు

# చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది: షర్మిల

లక్ష్మీనారాయణను అత్యంత కిరాతకంగా లారీతో ఢీ కొట్టించి, ఆపై వేట కొడవళ్లతో నరికి చంపడం చూస్తుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఎంత దారుణంగా పడిపోయాయో అర్థమవుతోందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి దారుణమైన రీతిలో ఒక రాజకీయ నాయకుడిని హత్య చేయడం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆమె అన్నారు. ఈ హత్యోదంతంపై పోలీసు శాఖ తక్షణమే స్పందించి, అత్యున్నత స్థాయి విచారణ చేపట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. ఈ ఘాతుకానికి పాల్పడిన అసలు నిందితులను త్వరితగతిన గుర్తించి, వారికి చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చూడాలని ఆమె పోలీసు యంత్రాంగాన్ని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆమె నొక్కి చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు షర్మిల పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా నిలుస్తుందని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ మేరకు షర్మిల సోషల్ మీడియాలో పోస్టు చేశారు. తన పోస్టుకు ఏపీ పోలీస్, చంద్రబాబు, పవన్ కల్యాణ్ లను ట్యాగ్ చేశారు.

# ఉగ్రదాడి దోషులను వదిలిపెట్టం: నరేంద్ర మోదీ

ఉగ్రవాద దాడి చిత్రాలను చూసిన తర్వాత ప్రతి భారతీయుడు ఆగ్రహంతో రగిలిపోతున్నాడని తాను అర్థం చేసుకోగలనని ప్రధాని అన్నారు. "ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారి నిరాశకు, పిరికితనానికి పహల్గామ్ దాడి అద్దం పడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. కశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొంటున్న తరుణంలో, పాఠశాలలు, కళాశాలలు తిరిగి కళకళలాడుతున్న వేళ, అభివృద్ధి పనులు ఊపందుకున్న సమయంలో, ప్రజాస్వామ్యం బలపడుతున్నప్పుడు, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతున్నప్పుడు, యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నప్పుడు.. దేశ శత్రువులకు, జమ్మూకశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చలేదని ప్రధాని విమర్శించారు. "కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనే ఉద్దేశ్యంతోనే ఉగ్రవాదులు, వారి యజమానులు ఇంత పెద్ద కుట్ర పన్నారు" అని మోదీ ఆరోపించారు. ఉగ్రవాదంపై జరుగుతున్న ఈ యుద్ధంలో 140 కోట్ల మంది భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద బలమని ప్రధాని నొక్కిచెప్పారు. "ఈ ఐక్యతే ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఆధారం. ఈ సవాలును ఎదుర్కోవడానికి మన సంకల్పాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి. ఒక దేశంగా మనం బలమైన సంకల్ప శక్తిని ప్రదర్శించాలి. ఈ ఉగ్రదాడి తర్వాత యావత్ దేశం ఒకే గొంతుకతో మాట్లాడుతున్న విషయాన్ని నేడు ప్రపంచం గమనిస్తోంది" అని ఆయన అన్నారు. ఈ దాడి ఘటనపై ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సంతాప సందేశాలను ప్రధాని ప్రస్తావించారు. "భారతీయులమైన మనం అనుభవిస్తున్న ఆగ్రహాన్నే యావత్ ప్రపంచం కూడా అనుభవిస్తోంది. ఉగ్రదాడి తర్వాత ప్రపంచవ్యాప్తంగా సంతాప సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రపంచ నాయకుల నుంచి నాకు ఫోన్ కాల్స్, సందేశాలు అందాయి. వారంతా ఈ ఘోరమైన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదంపై మన పోరాటంలో 140 కోట్ల మంది భారతీయులతో యావత్ ప్రపంచం నిలుస్తోంది" అని మోదీ వివరించారు. "బాధిత కుటుంబాలకు నేను మరోసారి హామీ ఇస్తున్నాను, మీకు న్యాయం జరుగుతుంది. కచ్చితంగా న్యాయం జరుగుతుంది. ఈ దాడికి పాల్పడిన వారు, కుట్రదారులు అత్యంత కఠినమైన ప్రతిస్పందనను ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు.

# శ్రీశైల క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటకరంగ అభివృద్ధికి నివేదికలు ఇవ్వండి

## -శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి

## -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

శ్రీశైల మహా క్షేత్రాన్ని, క్షేత్ర పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నివేదికలు సిద్ధం చేస్తున్నామని అందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శ్రీశైలం క్షేత్ర అభివృద్ధిపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ తో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ రాము నాయక్, డీఎఫ్ఓ సాయిబాబా, శ్రీశైలం దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, ఆత్మకూరు ఆర్డీఓ అరుణజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ శివప్రసాద్ రెడ్డి, జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణమూర్తి, ఏపీటీడీసీ డివిఎం లక్ష్మీనారాయణ సంబధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ శ్రీశైల దివ్య క్షేత్రంతోపాటు చుట్టుపక్కల ఉన్న పరిసర ప్రాంతాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకపరంగా, అహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని ఇందుకు అవసరమయ్యే డాక్యుమెంట్లు, సర్వే నంబర్ల వారీగా విస్తీర్ణ వివరాలు ఇవ్వాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రీశైలానికి వచ్చే భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం మూడు రోజులపాటు శ్రీశైలం ప్రాంతంలోనే ఉండి పరిసర ప్రాంతాలలో ఉన్న ప్రకృతి అందాలను దర్శించేందుకు వీలుగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. శ్రీశైలం వచ్చే భక్తుల సౌకర్యార్థం వసతి, క్యూలైన్స్, రవాణా, పార్కింగ్ ఇతర మౌలిక సదుపాయాలు తదితర 9 రకాల కాన్సెప్ట్ లతో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగానే సున్నిపెంట ప్రాంతంలో గుర్తించిన 178 ఎకరాల రెవెన్యూ భూముల్లో 50 ఎకరాలు పర్యాటక శాఖకు కేటాయించేందుకు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. గతంలో ఇరిగేషన్ కు సంబంధించిన 1468.52 ఎకరాల ఇరిగేషన్ భూముల్లో 719 ఎకరాలు వివిధ శాఖలకు కేటాయించడం జరిగిందన్నారు.

# మే డే ను జయప్రదం చేయండి - సిఐటియు.

ఏప్రిల్ 2025 నంద్యాల జిల్లా: బండి ఆత్మకూరు మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐటియు మండల నాయకుడు రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో, జిల్లా నాయకుడు రత్నమయ్య మాట్లాడుతూ కార్మికుల పని గంటల తగ్గింపు కోసం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను ఎనిమిది గంటల పని దినాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం జరిగిందని, ఈ చట్టం అమలు అయితే కార్మికుడు బానిసలా యజమానులకు పని చేయాల్సి వస్తుందని పెద్ద ఎత్తున కార్మికుల పోరాటం నిర్వహించడం వల్ల ఈ చట్టాలను అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం జంకుతుందని ఇప్పటికే బడా కార్పొరేటర్లు ఆదివారం సెలవు లేకుండా 24 గంటల పని చేయాలని కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తున్నారని కార్మికుల పోరాడి సాధించకుండా ఎనిమిది గంటల పని దినాన్ని కార్మిక చట్టాలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహించాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు



## ఆ గ్రామ సచివాలయంలో పనిచేయని

# ప్రింటర్లు, కంప్యూటర్

### -ప్రజలకు సేవ ఆటంకం.



ఏప్రిల్ 2025 నంద్యాల జిల్లా : బండి ఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో గ్రామ సచివాలయం నందు గత మూడు రోజుల నుండి ప్రింటర్ పనిచేయకపోవడంతో సచివాలయం కి వచ్చిన ప్రజలు వెను తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆరోపించారు. గ్రామ సచివాలయం నందు రెండు ప్రింటర్లు, రెండు కంప్యూటర్లు ఉండగా అందులో రెండు ప్రింటర్లు, ఒక కంప్యూటర్ పనిచేయకపోవడంతో ప్రజల సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ సచివాలయంలో పనిచేయని కంప్యూటర్ ను, ప్రింటర్లను రిపేర్ చేయించాలని గ్రామస్తులు కోరారు.

## లోన్‌లో బాంబు డాగ్స్ కాళ్ళ తనిఖీలు



డోన్

ఇటీవల పహల్దామ్ లో టెర్రరిస్టులు దాడి నేపథ్యంలో డోన్ లోని రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్ రవాణా కేంద్రంలోని, పార్సల్ పాయింట్ లలో సీఐ ఇంతియాజ్ భాష శనివారం తనిఖీ నిర్వహించారు. పోలీస్ సిబ్బంది బాంబ్, డాగ్ స్క్వాడ్ల సహాయంతో తనిఖీలు చేపట్టారు.” ప్రజల భద్రత మా ప్రాధాన్యం ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటాం” అని సీఐ తెలిపారు.

## వేదమాత బ్రాహ్మణ సంగం సర్వసభ్య సమావేశం



ధోన్

ధోన్ వేదమాత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈరోజు జరిగిన సర్వసభ్య సమావేశంలో జమ్మూకాశ్మీర్లోని పహల్గాంలో భారతీయులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఖండిస్తూ రెండు నిమిషముల పాటు సంఘ సభ్యులందరూ మౌనం పాటించారు. రేపు సాయంత్రం7 గంటలకు కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తామని గౌరవ సభ్యులు పేర్కొన్నారు.పదవ తరగతి, ఇంటర్మీడియట్లలో అత్యధిక మార్కులు సాధించిన బ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు చిరు సత్కారం అందచేశారు.మే 2 తేదీ జరగబోయే జగద్గురువులు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని దాదాపు 70 మంది బ్రాహ్మణ మహిళా మాతలకు శ్రీ గాయత్రీ పీఠ వ్యవస్థాపకులు,కళారత్న, శతావధాని శ్రీ గండ్లూరి దత్తాత్రేయ శర్మ గారు,శ్రీమతి అన్నపూర్ణమ్మ గార్ల చేతుల మీదుగా ఒకే వర్ణము గల చీరలను వితరణ చేయడం జరిగినది. డోన్ పట్టణంలో ఉండే దాదాపు అన్ని బ్రాహ్మణ కుటుంబ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సమావేశంలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేయించిన శ్రీ ఆది శంకరాచార్యుల ఉత్సవ కాంస్య విగ్రహానికి షోడశోపచార పూజలు నిర్వహించారు.ఈ సమావేశానికి శ్రీ వేదమాత బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు శ్రీ దత్తాత్రేయ శర్మ గారు, కార్యనిర్వహక అధ్యక్షులు శ్రీ నంద్యాల శంకర శర్మ గారు, అలాగే సంఘ ఉపాధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు పలువురు పాల్గొన్నారు.





## రోడ్డు నియమాలు తప్పనిసరిగా పాటించాలి....

### -ఎస్సై వరప్రసాద్.

రుద్రవరం.

వాహనాలు నడిపేవారు రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై వరప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని నరసాపురం నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనా నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, వాహనాలకు సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. వాహనాలలో అధికంగా లోడుతో ప్రయాణించకూడదు అన్నారు. మైనర్ బాలురకు వాహనాలను నడపకూడదన్నారు. నియమ నిబంధనలను అతిక్రమిస్తే కేసులతోపాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఢీకొన్న కారు...

### -తప్పిన ప్రమాదం.



రుద్రవరం.

మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలోని మలుపు దగ్గర విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినగా రెండువిద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వివరాల్లోకెళితే డి కొట్టాల గ్రామానికి చెందిన వారు శనివారం కారులో ఆళ్లగడ్డ వైపు నుంచి ఢీకొట్టాల గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యలో చిన్న కంబలూరు గ్రామంలో ఉన్న మలుపు దగ్గర ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదు మంది క్షేమంగా బయటపడ్డారు. కారు స్వల్పంగా దెబ్బ తిన గా, రెండు విద్యుత్ స్తంభాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే గ్రామస్తుల అక్కడికి చేరుకొని కారులో ఉన్న వారందరినీ క్షేమంగా బయటకు తీశారు. ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా బయటపడడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.





## శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు పోలీసులు అండగా ఉంటారనే భరోసా కల్పించేందుకు కార్డెన్ సర్చ్ ఆపరేషన్.

### - చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక.

నంద్యాల

నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా %ఖూా% గారి ఆదేశాలమేరకు నంద్యాల సబ్ డివిజన్ %ూూా% జావళి ఆల్ఫోన్స్ %ఖూా% గారి సూచనలతో నంద్యాల వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూరు బస్టాండ్, చెరువుకట్ట ప్రాంతాలలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అనుమానితుల ఇల్లు, అనుమానిత వ్యక్తులు, రౌడీ షీటర్లు నేరచరిత్ర గల వారి ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం అనుమానితులు, నేరచరిత్ర గలవారు, రౌడీషీటర్లు ఏదైనా నేరాలలో పాల్గొంటున్నారని అనుమానంతో వారి వేలిముద్రలను మొబైల్ సిస్టం చెక్ డివైస్ ద్వారా పరిశీలించడం జరిగింది.ఈ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగించిన, నేరాలలో పాల్గొన్న ,చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో అనగా గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా, మట్కా, జూదం మొదలగు వాటికి సంబంధించిన కార్యకలాపాలలో పాల్గొంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి గారు, 2 టౌన్ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ గారు, సబ్ ఇన్స్పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నా క్యాంటీన్ భోజనం పంపిణీ తనిఖీ



: ఎమ్మిగనూరు

అన్న క్యాంటీన్ భోజనం పంపిణీ మునిసిపల్ కమీషనర్ ఎన్ గంగిరెడ్డి తనిఖీ నిర్వహించారు. శనివారం పట్టణం లోని సోమప్ప సర్కిల్ నందు గల అన్న క్యాంటీన్ నందు భోజన పంపిణీ తనిఖీ చేయడం జరిగింది. ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకోవడం జరిగింది. భోజన రుచిని, శుభ్రతను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏ.ఈ. శరత్ చంద్ర పాల్గొన్నారు.

## ఆర్కే కంటి ఆసుపత్రి లో ఆరోగ్య సేవలు

### -50 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతం




: ఎమ్మిగనూరు

పట్టణంలోని శివ టాకీస్ వెనక ఉన్న ఆర్ కే కంటి ఆసుపత్రి లో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటు లో ఉన్నట్లు ఆర్కే కంటి ఆసుపత్రి డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు.శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఆర్కే కంటి ఆసుపత్రి లో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించుకున్న 50 మంది సమక్షంలో డాక్టర్ హేమంత్ కుమార్ ను ఎమ్మిగనూరు ప్రముఖ వైద్యులు వై గౌడప్ప గౌడ్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ గౌడప్ప మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవా ద్వారా 50 మంది కు కంటి ఆపరేషన్లు ను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ హేమంత్ కుమార్ ను ప్రతి ఒక్కరూ అభినందించాలి.భవిష్యత్తు లో కంటి ఆపరేషన్లు అవరమయ్యే వారు ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసుకోవచ్చునని సూచించారు.ఇటువంటి వైద్య సేవలు ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.కార్యక్రమంలో ఆర్కే ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ హేమంత్ కుమార్ తండ్రి రాజేంద్ర ప్రసాద్, జీసస్ టెంపుల్ పాస్టర్ సోలోమన్, న్యాయవాది చార్లెస్, గీతామందిర్ సభ్యులు నటరాజ్ స్వామి తో పాటు కంటి ఆపరేషన్లు చేసుకున్న 50 మంది కూడా పాల్గొన్నారు.

## ఎస్సీ కాలనీకి చెందిన మృతురాలు జ్ఞానమ్మ కుటుంబానికి ఎమ్మెల్యే బీవీ తరఫున ఆర్థిక సహాయం



ఎమ్మిగనూరు

పట్టణ ఎస్సీ కాలనీలో ఒక బీద విధవరాలు అయినటువంటి వకీలు రామక్కవ్వ చిన్న కోడలు జ్ఞానమ్మ అనారోగ్యముతో మధ్యాహ్నం మరణించడం జరిగినది . శనివారం ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆదేశాలతో ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ బండ నరసప్ప వారి గృహాన్ని సందర్శించి భౌతిక దేహానికి నివాళులర్పించి మట్టి ఖర్చులకు గాను ఐదు వేల రూపాయలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఏడో వార్డు ఇంచార్జ్ అంబేద్కర్ ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు డైరెక్టర్ కదిరి కోట షాలేము, తదితరులు పాల్గొన్నారు.

## కాశ్మీర్లో ఉగ్రవాదుల పైశాచిక దాడికి సిపిఎం తీవ్రఖండన




: ఎమ్మిగనూరు

కాశ్మీర్లో ఉగ్రవాదుల పైశాచిక దాడి మానవ సమాజం తలదించుకునేలా ఉందని సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు, పట్టణ నాయకులు రాముడు పేర్కొన్నారు. శనివారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని తేరు బజార్లో కాశ్మీర్ ఉగ్రవాద చర్యలు నిరసిస్తూ క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. చనిపోయిన మృతులకు ఆత్మశాంతి కలగాలని మౌనం పాటించారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు యు. రమేష్, సిపిఎం కార్యకర్తలు అబ్దుల్లా, ఉస్మాన్ వలి, ఇస్మాయిల్, నాగరాజు, తిమ్మయ్య, రఫీ, వకీల్ పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి.

### -... డా. అమర్నాథ్ రెడ్డి.

రుద్రవరం. :

వేసవికాలంలో వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎండలు తీవ్రతరమై దాదాపు 40 డిగ్రీల పైన నమోదవుతున్నాయన్నారు. వడదెబ్బ తగిలిన వారిలో 40 శాతం మంది మృత్యువాత పడే ఆస్కారం ఉందని తక్షణమే వైద్య సేవలు అందించగలిగితే ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చున్నారు. ఎండలు ఎక్కువైనప్పుడు మనిషి శరీరంలోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్ర మండల నాడీ వ్యవస్థ దెబ్బతినడం మూలంగా వడదెబ్బకు గురి అవుతారన్నారు. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపి తల తిరగడం, నాలుక ఎండిపోవడం, చెమట పట్టకుండా ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం మగత కలవరింతలు, ఫిట్స్ పాక్షిక, పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలని వివరించారు. 50 ఏళ్లు పైబడిన వ్యక్తులు వేడి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనులు చేయొద్దని సూచించారు గర్భిణీలు, బాలింతలు, అప్పుడే పుట్టిన శిశువులు, పసిపిల్లలు రేకుల షెడ్డులో నివసించే వ్యక్తులు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు ఎక్కువగా వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు....**

వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలని డాక్టర్ సూచించారు. శరీరంపై ఉండే దుస్తులు తొలగించి చల్లని నీటితో శరీరాన్ని కడిగి ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరాన్ని తుడచాలని, చల్లని గాలి తగిలేలా చూడాలన్నారు. చల్లని నీరు ఉప్పు ఇతర లవణాలు కలిపిన నీరు ఓఆర్ఎస్ ద్రావణం



త్రాగించి వెంటనే ఆసుపత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించాలన్నారు. సాధ్యమైనంతవరకు మిట్ట మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయట తిరగకూడదని సూచించారు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే ఉప్పు కలిపిన మజ్జిగ ,ఉప్పు కలిపిన పళ్ళ రసాలు తాగి వెళ్లాలని సూచించారు.